## అయ్యో.. బిడ్డా..



యశ్వంత్ (ఫైల్)

**17 ఏళ్ల వయసున్న ఈ బిడ్డడు.. బడిలో, కళాశాలలో చెప్పిన పాఠాలు మాత్రమే విన్నాడు, చదివాడు. జీవిత పాఠాల గురించి బడిలో ఉపాధ్యాయులుగానీ, కళాశాలలో అధ్యాపకులుగానీ, ఇంట్లో తల్లిదండ్రులుగానీ చెప్పి ఉండకపోవచ్చు. అందుకేనేమో, పరీక్షలు మాత్రమే 'జీవితం' అనుకున్నట్టున్నాడు. 'పరీక్ష ఫెయిలైతే.. జీవితంలో ఫెయిలయినట్లే, బతికి వృథా..' అని భ్రమించినట్టున్నాడు.. ప్రాణం తీసుకున్నాడు.**

చండ్రుగొండ, మే 3: మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన రాజబోయిన నాగేశ్వరరావు-లక్ష్మి దంపతుల ఇద్దరు కుమారుల్లో పెద్దోడు యశ్వంత్.. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఓ సబ్జెక్ట్‌లో ఫెయిలయ్యాడు. ఆ రోజు నుంచి అతడు మానసికంగా బాధపడుతున్నాడు. తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం వ్యవసాయ పనుల కోసం చేను వద్దకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత, వారికి తెలియకుండా, సమీపంలోగల చెట్టుకు వద్దకు వెళ్లాడు. ఆ చెట్టు కొమ్మకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తల్లిదండ్రులు గమనించి గుండెలు బాదుకుంటూ రోదించారు. ఇంటర్‌లో ఫెయిల్ అయ్యానన్న మనో వేదనను తట్టుకోలేకనే తమ బిడ్డడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై మాచినేని రవి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటింగ్ మొదలైంది..!



హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

బూర్గంపహాడ్, మే 3: పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా పది రోజులు ఉంది. కానీ, కొన్నిచోట్ల మాత్రం అప్పుడే ఓటింగ్ (పోలింగ్) మొదలైంది..! కొందరు వృద్ధులు ఓట్లేశారు..!! శారీరకంగా అశక్తులైన కురువృద్ధులు (85 ఏళ్లు పైబడిన వారు), వికలాంగులు.. పోలింగ్ రోజున కాకుండా, ముందుగానే తమ ఇంటి నుంచే ఓటు వేసేందుకు (హోం ఓటింగ్) కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇది శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 8 వరకు కొనసాగుతుంది. మండలంలోని సోంపల్లి, రెడ్డిగూడెం గ్రామాల్లో కొందరు కురు వృద్ధులు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేశారు. వారి వద్దకు తహసీల్దార్ ముజాహిద్, ఆర్ఐలు నర్సింహారావు, ముత్తయ్య, ఎన్నికల సిబ్బంది శుక్రవారం వెళ్లి ఓటు వేయించారు. దీనిని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ పరిశీలించారు.

**కరకగూడెం మండలం తుమ్మలగూడెంలో..**

కరకగూడెం, మే 3: మండలంలోని తుమ్మలగూడెం పంచాయతీలో శుక్రవారం హోం ఓటింగ్‌ను రిటర్నింగ్ ఆఫీసర్/తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి మధు, స్పెషల్ ఆఫీసర్లు నిర్వహించారు. వయోవృద్ధులు, వికలాంగులు ఓటు వేశారు.

**మణుగూరులో..**

మణుగూరు టౌన్, మే 3: మణుగూరు మండలంలో, పట్టణంలో శుక్రవారం కురువృద్ధులు, వికలాంగులు మొత్తం 31 మంది తమ ఇళ్ల వద్దనే ఓటు వేశారు. దీనిని తహసీల్దార్/సహాయ ఎన్నికల అధికారి రాఘవరెడ్డి పరిశీలించారు.

## బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

దుమ్ముగూడెం, మే 3: మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచార రథాన్ని పార్టీ లక్ష్మీనగరం కార్యాలయ ఆవరణలో మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు కణితి రాముడు, జానీపాషా, తునికి కామేష్, మడకం రామారావు, దామెర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**చర్లలో..**

చర్ల, మే 3: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత ఎన్నికల ప్రచార రథం శుక్రవారం ప్రారంభమైంది. ముందుగా స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో నాయకులు పూజలు చేయించారు. సోయం రాజారావు, దొడ్డి తాతారావు, కాపుల కృష్ణార్జునరావు, అజీజ్, ఇరసవడ్ల రాము, గొర్ల రాజబాబు, దొడ్డి సూరిబాబు, తుర్రం మురళి పాల్గొన్నారు.

# 'హద్దు'లేని దందా!

- ములకలపల్లిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- అక్రమార్కులకు అడ్డాగా మారిన గుర్రాలకుంట వాగు
- ఎన్నికల విధుల్లో బిజీ అంటూ ముఖం చాటేసిన అధికారులు




ములకలపల్లి మండలం గుర్రాలకుంట వాగులో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ములకలపల్లి, మే 3 : ఇసుక అక్రమార్కులకు గుర్రాలకుంట వాగు అడ్డాగా మారింది. రెండు మండలాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న వాగును అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల పంట పండుతోంది. దీనికి తోడు ఎన్నికల విధుల్లో అధికారులు బిజీబిజీగా ఉండడం.. అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ములకలపల్లి మండలం సీతారాంపురం పంచాయతీకి, పాల్వంచ మండలానికి మధ్య సరిహద్దు ప్రాంతంలో గుర్రాలకుంట వాగు ఉంది. వాస్తవానికి ఈ ప్రాంతం ములకలపల్లి మండలంలో ఉండడంతో గతంలో అనేకసార్లు ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులపై దాడులు చేసి కేసులు నమోదు చేశారు. కానీ.. ఇప్పుడు పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నా అధికారులు 'సరిహద్దు' సాకు చూపుతూ దాడులు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ఎన్నికల బిజీలో అధికారులు**

పార్లమెంట్ ఎన్నికల విధుల్లో అధికారులు తలమునకలై ఉండడంతో వీరి దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు పగలూ, రాత్రి తేడా లేకుండా వందల ట్రాక్టర్లను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సుమారు 50 మంది కూలీలు ట్రాక్టర్ల లోడింగ్‌కు పని చేస్తున్నారంటే దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పాల్వంచ పట్టణానికి నిత్యం ట్రాక్టర్లలో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇటీవల కాలంలో పోలీసులు ట్రాక్టర్ యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**కొత్తగా చార్జ్ తీసుకొన్నా**



నేను కొత్తగా చార్జ్ తీసుకొన్నా. గుర్రాలకుంట వాగు సరిహద్దు ప్రాంతం ఏ మండల పరిధిలో ఉందో విచారణ చేసి తెలుసుకుంటాం. ప్రసుతానికి పార్లమెంట్ ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నాం. ఎన్నికలు ముగిసిన తర్వాత మా పరిధిలో ఉంటే తగిన చర్యలు తీసుకుంటాం.

**- వివేక్, పాల్వంచ తహసీల్దార్**

**ఇసుక రవాణాను అడ్డుకుంటాం..**



గతంలో ఇసుక అక్రమంగా రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చాం. అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకుంటాం. లేనట్లయితే చర్యలు తీసుకుంటాం. ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాం.

**- ఎస్సై రాజమౌళి**

**మా పరిధిలోకి రాదు**



ఇసుక తరలిస్తున్న ప్రాంతం ములకలపల్లి మండల పరిధిలోనిది కాదు. ఇది పాల్వంచ పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండడం వల్ల తనిఖీలు చేయడానికి వీలు పడడం లేదు. సమయం చూసుకొని వాగును పరిశీలిస్తాం.

**- ఆర్ఐ తారాచంద్**

## 'నీట్'కు ఏర్పాట్లు పూర్తి

పాల్వంచ, మే 3: వైద్య విద్యనభ్యసించేందుకు ఈ నెల 5న నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) జరగనుంది. జిల్లా నుంచి 1,174 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారని నిర్వాహక కోఆర్డినేటర్ ఎంవీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏర్పాట్లు పూర్తయినట్లు పేర్కొన్నారు.

## స్వేచ్ఛగా, నిర్భీతిగా ఓటేయండి




దుమ్ముగూడెం: ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం/ఆళ్లపల్లి, మే 3: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భీతిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని దుమ్ముగూడెం సీఐ అశోక్, ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ కోరారు. మండల కేంద్రమైన లక్ష్మీనగరంలోని పోలీస్ స్టేషన్ నుంచి లక్ష్మీనగరం, ములకపాడు వరకు సీఆర్‌పీఎఫ్, 141 బెటాలియన్, దుమ్ముగూడెం పోలీసులు సంయుక్తంగా సీఐ అశోక్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ 141ఏ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు పి.కాశయ్య నదఫ్, ఎస్సై కేశవ్ పాల్గొన్నారు. ఆళ్లపల్లి మండలంలోని ఆళ్లపల్లి, వెంకటాపురం, మర్కోడు గ్రామాల్లో ఎస్సై రతీష్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఏఎస్సై వెంకటరెడ్డి, కానిస్టేబుళ్లు, టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలనుద్దేశించి సీఐ అశోక్, ఎస్ఐ రతీష్ మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## నమ్మక ద్రోహులకు ఓటుతో బుద్ధి చెప్పండి

**రోడ్ షోలో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు**



రోడ్ షోలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

దమ్మపేట/అశ్వారావుపేట, మే 24: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏవేవో హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత వాటిని గాలికొదిలేసి, నమ్మక ద్రోహం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. ఆయన శుక్రవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లుతో కలిసి దమ్మపేట, అశ్వారావుపేటలో రోడ్ షో నిర్వహించారు. తెలంగాణ ధాన్యాన్ని కొనేందుకు మోదీ ప్రభుత్వం నిరాకరిస్తే.. రైతుల పక్షాన పార్లమెంటులో తాను పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాకు రైల్వే లైన్‌ను తానే తీసుకొచ్చానన్నారు. తన కృషితోనే ఖమ్మంలో వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం సాగుతున్నదన్ని అన్నారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించిందని విమర్శించారు. ప్రతి నెలా మహాలక్ష్మి పథకం కింద రూ.2500 ఇస్తామన్న హామీని గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. నాయకులు వగ్గెల పూజ, డాక్టర్ భూక్యా ప్రసాద్, సున్నం నాగమణి, రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, ఆళ్ల జంగం, రావుల శ్రీనివాసరావు, దేవరపల్లి అజయ్‌కుమార్, అడపా కృష్ణయ్య, జల్లిపల్లి శ్రీరామమూర్తి, యూఎస్ ప్రకాష్, సంకా ప్రసాద్, మందపాటి రాజమోహన్ రెడ్డి, తాడేపల్లి రవి, కాసాని చంద్రమోహన్ పాల్గొన్నారు.

## భద్రాచలంలో అకాల వర్షం



పాల్వంచ రూరల్: ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు

భద్రాచలం, మే 3: భద్రాచలం పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, వడగళ్లతో కురిసిన వర్షానికి భారీ వృక్షాలు నేలకూలాయి, రోడ్లపై చెట్ల కొమ్మలు పడిపోయి, రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పట్టణ సీఐ సంజీవరావు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి చెట్లను తొలగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ వసతిగృహం ప్రహరీపై భారీ వృక్షం నేలకూలింది. రాజుపేట కాలనీలో విద్యుత్ స్తంభాలపై తాటిచెట్టు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దుమ్ముగూడెం మండలం తూరుబాక రామకృష్ణాపురం గ్రామంలో తాటిచెట్టుపై పిడుగుపడి దగ్ధమైంది.

**ఉరుములు, మెరుపులతో వర్షం**

బూర్గంపహాడ్, మే 3: మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.

**పాల్వంచ రూరల్‌లో..**

పాల్వంచ రూరల్, మే 3: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీగా ఈదులు గాలులు వీచాయి. అక్కడక్కడ సన్నని చినుకులు పడ్డాయి. రంగాపురం, నాగారం, సంగం, దంతెలబోర గ్రామాల్లో బలమైన ఈదురుగాలులు వీచాయి. దంతెలబోర, సీతారాంపురం గ్రామాల్లో కొన్ని రేకుల ఇండ్లపై కప్పులు ఎగిరిపోయాయి. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి.

## సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

కొత్తగూడెం క్రైం, మే 3: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి కొత్తగూడెం రానున్నారు. ప్రకాశం స్టేడియంలో సభాప్రాంగణం, హెలిపాడ్, పార్కింగ్ స్థలాల వద్ద భద్రత, ఇతరత్రా ఏర్పాట్లను ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు శుక్రవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) టి.సాయి మనోహర్, కొత్తగూడెం డీ ఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

చండ్రుగొండ, మే 3: మండలంలోని తిప్పనపల్లి, రేపల్లెవాడ, తుంగారం గ్రామాల్లోగల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను తహసీల్దార్ సంధ్యారాణి శుక్రవారం పరిశీలించారు. బూత్ లెవల్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.



ఇల్లెందు పట్టణంలో ఎగిసి పడుతున్న మిషన్ భగీరథ నీళ్లు

## 'భగీరథ'.. నీరంతా వృథా

- పైపులైన్ లీకేజీతో 50 మీటర్ల ఎత్తుకు ఎగిసిన నీరు
- నీటి ఉధృతితో పక్కనే ఉన్న రెండిళ్లకు నష్టం
- ఇంట్లోని సామగ్రి ధ్వంసం

ఇల్లెందు, మే 3: మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీ కావడంతో 50 మీటర్ల మేర నీరు ఎగిసిపడి సమీపంలోని రెండు ఇళ్లకు నష్టం వాటిల్లింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని మున్సిఫ్ కోర్టు ఏరియా సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మెయిన్ పైపులైన్ లీకేజీ కావడంతో సుమారు 50 మీటర్ల మేర నీళ్లు పైకి ఎగిసిపడ్డాయి. దీంతో పోటెత్తి ఎగిసిపడిన నీటితో పక్కనే ఉన్న గుంటి ఆండాలు, భూక్యా బాలు గృహాల రేకులు పగిలి పోయాయి. ఇంట్లోని సామగ్రి ఎగిరిపడగా.. సీలింగులు సైతం పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంటి ప్రహరీ కూడా కూలిపోయింది. దీంతో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఇంటి యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

**తప్పిన ప్రాణాపాయం**

ఒక్కసారిగా ఎగిసిపడిన నీటి వరద ఇళ్లలోకి దూసుకొచ్చింది. దీంతో భయకంపితులైన ఇంటి యజమానులు, కుటుంబ సభ్యులు పారిపోవడంతో ప్రాణపాయం తప్పింది. రోడ్డు వెడల్పు పనులు జరుగుతుండగా అక్కడ పరిచిన 20 ఎంఎం కంకర రాళ్ల నీటితో కలిసి వేగంగా ఇళ్లలోకి దూసుకొచ్చాయి. ఆ రాళ్లు తగిలితే చనిపోయేవాళ్లమని ఇళ్ల యజమానులు తెలిపారు. రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న సమయంలో మిషన్ భగీరథ అధికారులు అందుబాటులో ఉంటే పైపు లీకేజీ జరగకుండా ఉండేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మరమ్మతు చేస్తున్నాం : చిరంజీవి, ఏఈ, ఇల్లెందు మండలం**

ప్రస్తుతానికి రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. జేసీబీతో మట్టి తీస్తున్న క్రమంలో పైపులైన్ ఒత్తిడికి గురై ఉండొచ్చు. పైపులైన్ లీకైన ప్రాంతంలో మరమ్మతు చేయిస్తున్నాం. శనివారం వరకు పునరుద్ధరిస్తాం.

## ఎండలకు ముగ్గురి మృతి

కొత్తగూడెం క్రైం/ఇల్లెందు రూరల్/దుమ్ముగూడెం, మే 3: భానుడు భగభగ మండుతున్నాడు. ఆ వేడిని తట్టుకోలేక, వడదెబ్బతో శుక్రవారం ముగ్గురు మృతిచెందారు.

**కొత్తగూడెంలో ఒకరు..**

కొత్తగూడెంలోని ఏ-పవర్ హౌజ్ బస్తీకి చెందిన మదగాని రాజశేఖర్(45) పట్టణంలోని ఓ హోటల్‌లో సర్వెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎస్‌బీఐ సమీపంలో హఠాత్తుగా కింద పడిపోయి, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి కుమార్తెకు, బంధువులకు సమాచారమిచ్చారు. వారు వచ్చేసరికి రాజశేఖర్ మృతిచెందాడు. ఈయన భార్య కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. ఇద్దరు కుమార్తెల్లో పెద్దామెకు వివాహమైంది. చిన్న కుమార్తె చదువుతున్నది. తండ్రి హఠాన్మరణంతో ఆమె అనాథగా మారింది.

**ఇల్లెందులో ఒకరు..**

పట్టణంలోని 10వ వార్డుకు చెందిన ఫెర్టిలైజర్ వ్యాపారి శ్రీనివాస్ (49), వ్యాపార పనుల మీద మూడు రోజులుగా ఎండలో తిరుగుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలతో అస్వస్థుడయ్యాడు. స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్నప్పటికీ ఫలితం కనిపించలేదు. దీంతో, కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన అక్కడే శుక్రవారం మృతి చెందాడు.

**దుమ్ముగూడెం మండలంలో ఒకరు..**

దుమ్ముగూడెం, మే 3: మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన పాయం లక్ష్మయ్య శుక్రవారం ఆవులను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. వడదెబ్బతో వాంతులు అవడంతో అస్వస్థుడయ్యాడు. కొద్దిసేపటికే మృతిచెందాడు.

**పని వేళలు మార్చాలని వినతి**

సారపాక, మే 3: అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతున్న నేపథ్యంలో సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ ఉద్యోగులు-కార్మికుల పని వేళలు మార్చాలని, వారికి మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని కోరుతూ కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం హెచ్ఆర్ హెడ్ శ్యామ్‌కిరణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. యారం పిచ్చిరెడ్డి, ఎంఆర్ఎస్‌బీ రెడ్డి, గంజి వీరభద్రరావు, కప్పెర వెంకటరమణ, చింతల వినోద్‌కుమార్, గులమారి చంద్రశేఖర్, సాయిరాం, బీఎస్ఎస్ సూర్యనారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కనకయ్యకు పితృ వియోగం

టేకులపల్లి, మే 3: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య గురువారం మండలంలోని కోయగూడెంలోగల స్వగృహంలో గురువారం సాయంత్రం మృతిచెందారు. భౌతికకాయాన్ని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత శుక్రవారం సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాం బశివరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ, గుమ్మడి నర్సయ్య, మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ బిందు, ఎంపీ అభ్యర్థులు పోరిక బలరం నాయక్, అజ్మీర సీతారామ్‌నాయక్, సొసైటీ చైర్మన్లు లక్కినేని సురేందర్‌రావు, మూల మధుకర్‌రెడ్డి, వడ్లమూడి దుర్గాప్రసాద్, మేకల మల్లిబాబు తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే కనకయ్యను ఆయన ఇంటి వద్ద రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు పువాళ్ళ దుర్గాప్రసాద్, సాదు రమేష్‌రెడ్డి, తుపాకుల ఎలగొండస్వామి, పుచ్చకాయల వీరభద్రం తదితరులు ఉన్నారు.

## రేపు మోడల్ ఎంసెట్

సారపాక, మే 3: మోడల్ ఎంసెట్‌ను ఆదివారం ఉదయం స్థానిక బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన సదస్సు

పర్ణశాల, మే 3: మండలంలోని పెద్ద ముసలిమడుగు గ్రామస్తులకు పర్ణశాల పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు వ్యక్తిగత-పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, వడదెబ్బ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. వెంకటనర్సమ్మ, అనసూర్య, నాగేశ్వరరావు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## చదువులమ్మ బిడ్డలకు అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీపీ

అశ్వారావుపేట టౌన్, మే 3: పదోతరగతి ఫలితాల్లో 10కి 10 జీపీఏ సాధించిన చదువులమ్మ బిడ్డలను ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి శుక్రవారం అభినందించారు. వారికి శాలువాలు కప్పి సన్మానించారు. మెమెంటోలు బహూకరించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

కొత్తగూడెం క్రైం, మే 3: భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా రాయ్‌గుడం అటవీ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. రాయ్‌గుడం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, కోబ్రా బలగాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి భద్రతా దళాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య సుమారు రెండు గంటలపాటు భీకర పోరు జరిగినట్లు పోలీస్ వర్గాల సమాచారం. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఎలాంటి నష్టం వాటిల్లలేదని, ఘటనా స్థలం నుంచి మావోయిస్టులు తప్పించుకున్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చౌహాన్ ధ్రువీకరించారు.

## ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

అశ్వారావుపేట, మే 3: మద్యానికి బానిసగా మారి, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని పేటమాలపల్లికి చెందిన రాజశేఖర్(28) మద్యానికి బానిసగా మారాడు. మార్చి 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అప్పటి నుంచి కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు శుక్రవారం మృతిచెందాడు. ఈయన సోదరి వెంకటలక్ష్మి ఫిర్యాదుతో కేసు ఏఎస్సై యాకూబ్ అలీ దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం స్వాధీనం

పాల్వంచ రూరల్, మే 3: మండలంలోని కోడిపుంజుల వాగుకు చెందిన తేజావత్ శ్రీను నుంచి రూ.3,900 విలువైన అక్రమ మద్యాన్ని రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేశారు.

**అశ్వారావుపేటలో..**

అశ్వారావుపేట, మే 3: పట్టణంలోని చిన్నంశెట్టి బజార్‌లో కిరాణా దుకాణంపై ఎస్సై శివరామకృష్ణ శుక్రవారం దాడి చేశారు. రూ.11,341 విలువైన మద్యం సీసాలు స్వాధీనపర్చుకున్నారు. దుకాణాదారుడు రామకృష్ణపై కేసు నమోదు చేశారు.

## నగదు పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, మే 3: మండలంలోని పెంట్లం చెక్‌పోస్ట్ వద్ద ట్రాలీ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేని రూ.90 వేలను ఎస్సై చంద్రశేఖర్ స్వాధీనపర్చుకుని సీజ్ చేశారు.

## వివాహిత అదృశ్యం

అశ్వారావుపేట, మే 3: పెళ్లికి వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కాళింగుల బజార్‌కు చెందిన మూల అనూష, గురువారం రాత్రి దమ్మపేట మండలం అల్లిపల్లిలో స్నేహితుల పెళ్లికని కుమారుడితో కలిసి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో సోదరి సోనాలి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జి.నాగేశ్వరరావు తెలిపారు.

## హంతకుడికి జీవిత ఖైదు

కొత్తగూడెం టౌన్, మే 3: హత్య కేసులో హంతకుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పునిచ్చారు. పాల్వంచ మండలం మసీద్‌గుట్ట ప్రాంతానికి చెందిన దేవళ్ల లావణ్య, పాల్వంచ ఇందిరానగర్‌కు చెందిన భూక్యా విజయ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి పాప ఉంది. లావణ్యను విజయ్ తరచూ వేధిస్తూ, చంపుతానని బెదిరిస్తున్నాడు. దీనిని తట్టుకోలేని ఆమె క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కోలుకున్న తర్వాత, భర్తకు దూరంగా కూతురితో కలిసి విడిగా అద్దె ఇంటిలో ఉంటున్నది. అతడు అక్కడకు కూడా వచ్చి ఆమెతో గొడవపడసాగాడు. 2019, జూలై 8న అతడు లావణ్యను, పాపను తీసుకుని వెళ్లిపోయాడు. అదే రోజున మంచంపై విగతురాలిగా ఉన్న లావణ్యను తల్లి జ్యోతి గమనించింది. తన బిడ్డను విజయ్ చంపాడంటూ పాల్వంచ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును అప్పటి ఎస్సై ముత్యం రమేష్ నమోదు చేశారు. ఆ తర్వాత భూక్యా విజయ్‌పై కోర్టులో చార్జిషీట్ దాఖలైంది. 11మంది సాక్షులను కోర్టు విచారించి, విజయ్‌పై నేరం రుజువైనట్లుగా నిర్ధారించింది. జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏపీసీ పోసాని రాధాకృష్ణ మూర్తి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ గంగావత్ భాస్కర్, లైజన్ ఆఫీసర్ వీరబాబు సహకరించారు.

## యువకుడి ఆత్మహత్య

సారపాక, మే 3: యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుమన్ తెలిపిన వివరాలు.. స్థానిక పంచాయతీ కార్యాలయం వీధికి చెందిన నీలం అమరజీవి(35)-నాగమల్లేశ్వరి దంపతులు ఇటీవల గొడవపడ్డారు. ఆమె పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న అమరజీవి, గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య ఫిర్యాదుతో ఎస్సై సుమన్ కేసు నమోదు చేశారు.

## 40 లీటర్ల నాటుసారా పట్టివేత

పర్ణశాల, మే 3: మండలంలోని తోగ్గూడెం గ్రామ శివారులో శుక్రవారం బైక్‌పై తీసుకెళ్తున్న 40 లీటర్ల నాటు సారాను హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది స్వాధీనపర్చుకున్నారు. సారా తీసుకెళ్తున్న సుజ్ఞానపురం గ్రామస్తుడు భూక్యా లాలుపై ఎస్సై కేశవరావు కేసు నమోదు చేశారు.

## పిడుగుపాటుకు రైతు మృతి

ములకలపల్లి, మే 3: పిడుగుపాటుతో ఓ రైతు మృతిచెందాడు. మరో రైతు పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని పూసుగూడెం పంచాయతీ ఒడ్డురామవరం గ్రామ రైతు బోడ శివరాం(43), ధాన్యం విక్రయించేందుకు శుక్రవారం మార్కెట్‌కు వెళ్లాడు. అప్పటికే యార్డులో ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో ఒక్కసారిగా పిడుగు పడింది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న మరో రైతు గుగులోత్ శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివరాంకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

* I, MOKARAM JAVEED, M/o. GOUSIA SULTANA CHANGED MY NAME AS MOHAMMAD MOKARAM JAVEED, M/o. ROKHSANA BEGUM, R/O. 4-45/1A, LAXMIDEVIPALLI VILLAGE & MANDAL, BHADRADRI KOTHAGUDEM DIST.

KMM-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073



నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616